

.. పదునే అదును
పత్తి సాగుకు పదును ఉన్నప్పుడే దుక్కులు దున్నాలని, సకాలంలో విత్తనాలు నాటాలని అధికారులు సూచిస్తున్నారు.
8లో



ప్రతిభకు పట్టం
ప్రతిభ గల పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకుండా ప్రభుత్వం డీఆర్డీఏ ద్వారా 'కార్పొరేట్ విద్య'ను అమలు చేస్తోంది.
8లో

గరిష్టం / కనిష్టం
37° / 26°

వాతావరణం
జిల్లాలో బుధవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో మాత్రం చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

కొత్తగూడెంఅర్బన్ : ఇంటర్‌మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24న ప్రారంభమవుతాయని, ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నామని డీఐఈఓ బి.సులోచనారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు జిల్లాలో 23 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 8,134 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో 5,408 మందికి గాను 4,707 మంది జనరల్, 701 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారని, ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 2,261 మంది, ఒకేషనల్ 465.. మొత్తం 2,726 మంది పరీక్ష రాయనున్నారని వివరించారు. అని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసివేయిస్తామని తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులు నడుపుతారని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. దానిపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని తెలిపారు. ప్రథమ సంవత్సర విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు, ద్వితీయ సంవత్సరం వారు మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని తెలిపారు. పరీక్షల విధులు నిర్వహించే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

సీతారామ పైప్‌లైన్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఈఈ, డీఈ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని రెడ్డిపల్లిలో చేపట్టిన సీతారామ ప్రాజెక్టు పైప్‌లైన్ పనులను ఇరిగేషన్ ఈఈ కోటగిరి సురేష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. దమ్మపేట మండలం ఆర్లపెంట నుంచి అశ్వారావుపేట మండలం రెడ్డిగూడెం వరకు 5.2 కిలో మీటర్ల మేర రెండు వరుసల పైపులైన్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఇందుకు రూ.12 కోట్లు వ్యయం అవుతోందన్నారు. ఇప్పటికి 60 శాతం మేర పనులు పూర్తయ్యాయని చెప్పారు. పైప్‌లైన్ నిర్మాణంలో నాణ్యత పాటించకుంటే కాంట్రాక్టర్‌పై చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డీఈ కృష్ణ ఉన్నారు.

మండలాలకు 'యూనిఫాం' పంపిణీ


యూనిఫాం క్లాత్ కట్ చేస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బడులు తెరిచేనాటికే యూనిఫాం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరిన యూనిఫాం క్లాత్‌ను మంగళవారం ఆయన మండలాలకు పంపిణీ చేశారు. జిల్లాకు 1,26,381 మీటర్ల వస్త్రం రాగా, మండలాల వారీగా విభజించి సరఫరా చేస్తున్నారు. యూనిఫాం కుట్టే బాధ్యతను డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి సైదులు, మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

అదుపు తప్పుతున్న ఆధిపత్య పోరు.. పోటా.. పోటీ

ఖద్దరు X కార్మికులు అన్నట్టుగా వ్యవహారం

- సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ
- జిల్లాలోని అన్ని చోట్లా ఐఎన్‌టీయూసీ గెలుపు
- ఇరు సంఘాల నేతల మధ్య ముదురుతున్న వైరం
- సంస్థలో వారి పనితీరుపై రాజుకున్న వివాదం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వ రంగ పరిశ్రమగా ఉన్న సింగరేణిలో ప్రధాన కార్మిక సంఘాల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటోంది. గడిచిన ఐదు నెలలుగా నెలకొన్న ఆధిపత్య పోరు అదుపు తప్పుతోంది.

కార్మిక నేతల పనులు ఇలా..

ఆరు జిల్లాల్లో విస్తరించిన సింగరేణిలో సుమారు 40 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా భూగర్భ, ఉపరితల గనులతో పాటు వివిధ వర్క్‌షాపులు, సివిల్, హెల్త్, ట్రాన్స్‌పోర్ట్ తదితర విభాగాల్లో విధుల్లో ఉన్నారు. ఇక్కడ పని చేసే కార్మికుల హక్కులు, రక్షణ, బదిలీలు తదితర అంశాలపై యాజమాన్యంతో చర్చించేందుకు కార్మిక సంఘాలు పని చేస్తాయి. వర్కర్స్ సేఫ్టీ, మైన్స్, జనరల్ మేనేజర్ తదితర కమిటీల సభ్యులు, పిట్ సెక్రటరీ, బ్రాంచి సెక్రటరీ, ఏరియా ఉపాధ్యక్షుడి వరకు వివిధ హోదాల్లో కార్మిక నేతలు ఉంటారు. వీరు రెగ్యులర్ విధుల్లో పాల్గొంటూనే కార్మికుల సమస్యలపై స్పందించాల్సి ఉంటుంది.

టీబీజీకేఎస్‌పై ఆరోపణలు..

సింగరేణిలో ఎన్నికల ద్వారా గుర్తింపు సంఘాన్ని ఎన్నుకుంటారు. సంస్థలో మొదటి నుంచీ సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ (సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఎస్‌సీడబ్ల్యూయూ)దే ఆధిపత్యం. ఆ తర్వాత స్థానంలో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ (సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్, ఎస్‌సీఎల్‌యూ) ఉండేది. తెలంగాణ ఉద్యమం మొదలైన తర్వాత బీఆర్‌ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ (తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం) హవా మొదలైంది. దశాబ్దకాలం పాటు సింగరేణిలో టీబీజీకేఎస్ తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది. గతంలో టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు ఆ సంఘానికి చెందిన నేతలు కనీసం పని ప్రదేశాల్లో యూనిఫామ్ ధరించడం, పనిముట్లు పట్టుకోవడం కూడా చేసేవారు కాదని, ఖద్దరు దుస్తుల్లోనే పని ప్రదేశాల దగ్గరకు వచ్చి మస్టర్ (హాజరు) పడగానే బయటకు వెళ్లిపోయేవారనే విమర్శలు వచ్చాయి. టీబీజీకేఎస్‌కు అనుకూలంగా సింగరేణి యాజమాన్యంపై అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందంటూ అనేక ఆరోపణలు వచ్చాయి. గతేడాది చివరలో ఒకేసారి అటు రాష్ట్రంలో, ఇటు సింగరేణిలో బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ అధికారం కోల్పోయాయి.

అధికారులకు తలనొప్పి..

రాష్ట్రంలో అధికార పార్టీ కాంగ్రెస్‌కు అనుబంధ కార్మిక సంఘమైన ఐఎన్‌టీయూసీ నేతలకు ఆదేశాలు జారీ చేయలేక, గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ నేతల డిమాండ్లను నెరవేర్చడం వీలుకాక వివిధ పని ప్రదేశాల్లో హెచ్‌ఓడీలుగా ఉన్న అధికారులు తలలు పట్టుకుంటున్నారని సాధారణ కార్మికులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత గనులు, వర్క్‌షాపుల దగ్గర ఈ పంచాయితీ తీవ్రమవుతోంది. రోజురోజుకూ ముదురుతున్న సమస్యకు పరిష్కార మార్గం చూపడంలో సింగరేణి యాజమాన్యం విఫలమవుతోందనే విమర్శలు వస్తున్నాయి.



ఇప్పుడు పోటాపోటీ..

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలిచింది. అయితే జిల్లాలోని ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం, కార్పొరేట్ ఏరియాల్లో ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. టీబీజీకేఎస్ అన్ని చోట్లా ఘోరంగా ఓడిపోయింది. దీంతో టీబీజీకేఎస్ నేతల్లో ఎక్కువ మంది రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీలో చేరారు. దీంతో గత జనవరి నుంచి అన్ని గనులు, వర్క్‌షాపులు, కార్పొరేట్ సెక్టార్‌లోని పని ప్రదేశాల వద్ద ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాల మధ్య ఘర్షణ పూరిత వాతావరణం నెలకొంది. ఐఎన్‌టీయూసీ సంఘానికి చెందిన కీలక నేతలు (గతంలో టీబీజీకేఎస్‌లో ఉన్నవారు) పని ప్రదేశాల్లో యూనిఫామ్ ధరించి విధులు నిర్వహించాలని, గతంలో లాగా మస్టర్ పడి వెళ్లిపోతామంటే కుదరదని ఏఐటీయూసీ నేతలు అంటున్నారు. డ్యూటీ చార్ట్ ప్రకారం వారికి పని చెప్పడంలో అధికారులు విఫలమైతే తాము కూడా పని చేయబోమని స్పష్టం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

మస్టర్ వేయించుకుని పని చేయకుండా వెళ్లిపోయే వారికి ఆబ్సెంట్ వేయాలని అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేశాం. దశల వారీగా బయోమెట్రిక్ విధానం కూడా అమల్లోకి తెస్తున్నాం. కార్మికులైనా, సంఘాల నేతలైనా సంస్థ నిబంధనలు, డ్యూటీ చార్ట్ ప్రకారం పని చేయాల్సిందే. అలా చేయని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం.

– ఎస్‌డీకే శ్రీనివాస్, డైరెక్టర్ (పా)

- ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీల నజర్
- ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా ప్రచారం
- కాంగ్రెస్ అభ్యర్థి తరఫున మంత్రులు పొంగులేటి, తుమ్మల
- బీఆర్‌ఎస్ నుంచి మాజీ మంత్రి కేటీఆర్, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు
- బీజేపీ ఆధ్వర్యాన భేటీలు.. కేడర్‌కు ఈటల దిశానిర్దేశం
- పోలింగ్ సమీపిస్తుండడంతో జోరుగా అభ్యర్థుల పర్యటనలు



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: వరంగల్ – నల్లగొండ – ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఇటీవలే లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో పూర్తిస్థాయిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంపై పార్టీలు దృష్టి సారించాయి. రాజకీయ పార్టీలు గతంలో కన్నా ఎక్కువగా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోగా.. ఉమ్మడి జిల్లాలో ఆయా పార్టీల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఈనెల 27న పోలింగ్ జరగనుండగా, ఇందుకు ఐదు రోజుల సమయమే ఉండడంతో ప్రచారంలో స్పీడ్ పెంచాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి తరఫున ఖమ్మం, ఇల్లెందు, కొత్తగూడెంలో సోమవారం మాజీ మంత్రి కేటీఆర్, బీజేపీ అభ్యర్థి తరఫున ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ ఖమ్మంలో ప్రచారం నిర్వహించారు. ఇక మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి తరఫున రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల సన్నాహక సమావేశాల్లో పాల్గొన్నారు.

మరో ఐదు రోజులే..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్‌కు ఐదు రోజుల సమయమే ఉంది. ఈ నియోజకవర్గానికి 2021లో ఎన్నికలు జరగ్గా.. బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వరరెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత ఆయన జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో ఉప ఎన్నిక జరుగుతోంది. ఈనెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, వచ్చే నెల 5న లెక్కింపు జరగనున్నాయి. ప్రచారానికి సమయం తక్కువగా ఉండడంతో పోటీలో ఉన్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు తీన్మార్ మల్లన్న, ఏనుగుల రాకేష్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ప్రచారం చేపట్టారు. ఈ నియోజకవర్గం మూడు ఉమ్మడి జిల్లాల్లో విస్తరించి ఉండడంతో కొద్దిరోజులుగా వీరు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

వ్యూహాత్మకంగా కాంగ్రెస్..

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో నాయకులతో కలిసి ప్రచార సమావేశాలకు హాజరయ్యారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఉమ్మడి జిల్లాలో ఇన్‌చార్జిలు, కో ఆర్డినేటర్లను నియమించారు. అభ్యర్థి తరఫున రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం పాలేరు, ఖమ్మం నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల సమావేశాలకు హాజరై మల్లన్నను గెలిపించాలని కోరారు.

బీఆర్‌ఎస్ విస్తృత ప్రచారం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి కొద్దిరోజులుగా ఉమ్మడి జిల్లాను చుట్టేస్తున్నారు. గతంలోనే బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సన్నాహక సమావేశాల్లో పాల్గొంటూనే, రెండు జిల్లాల్లో పట్టభద్రులను కలుస్తున్నారు. మాజీ మంత్రి కేటీఆర్ సైతం సోమవారం ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లెందులో పర్యటించి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో నాగర్‌కర్నూల్, ఖమ్మం ఎంపీ అభ్యర్థులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. నల్లగొండ, వరంగల్‌తోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రత్యేక దృష్టి సారించి ప్రచారం చేపట్టారు.

గుజ్జుల తరఫున ఈటల

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి సైతం ఉమ్మడి ఖమ్మం జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గత కొద్దిరోజులుగా ఇక్కడే మకాం వేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీ లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఇతర నాయకులు అభ్యర్థితో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ఉమ్మడి జిల్లాలో ప్రచారం చేశారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ సైతం సోమవారం ఖమ్మంలో జరిగిన ప్రచారానికి హాజరయ్యారు.

నెలాఖరు నాటికి కొనుగోళ్లు పూర్తిచేయాలి

- జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్
- సుజాతనగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన


సుజాతనగర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సురేంద్రమోహన్

సూపర్‌బజార్(కొత్తగూడెం) : ఈ నెలాఖరు నాటికి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ అధికారులకు సూచించారు. ధాన్యంలో తేమ శాతం ఉన్నప్పటికీ కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ జిల్లాలో 136 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. 1.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 2,081 మంది రైతుల నుంచి 12,400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, రూ. 24 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని వివరించారు.

తేమశాతం పరిశీలన..

సుజాతనగర్ : సుజాతనగర్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ మంగళవారం తనిఖీ చేశారు. ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. 20 శాతం తేమ ఉన్నట్టుగా గుర్తించిన ఆయన.. 17 శాతం వచ్చేంతవరకు ఆరబెట్టాలని రైతులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీఓ విద్యాచందన, డీఎస్‌ఓ రుక్మిణీదేవి, జిల్లా సహకార అధికారి ఖుర్షీద్, వ్యవసాయాధికారి బాబూరావు, ఆర్డీఓ మనోహర్, డీఎంఓ అలీం, సివిల్ సప్లై డీఎం త్రినాథ్‌బాబు, జీసీసీ డీఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'నిధిమ్' అడ్మిషన్లు ప్రారంభం

కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి

సూపర్‌బజార్(కొత్తగూడెం): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిధిమ్) ఆధ్వర్యంలో ఈ విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. 26 ఎకరాల సువిశాల క్యాంపస్‌లో మూడు కోర్సులను అందిస్తోందని, అంతర్జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్లకు పేరుగాంచిన ఐఐటీ, ఐఐఎం మాదిరిగా టూరిజం హాస్పిటాలిటీ కోర్సులకు పేరగాంచిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అందిస్తున్న మూడు కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంబీఏ(టూరిజం అండ్ హాస్పిటాలిటీ) కోర్సు కాలవ్యవధి రెండేళ్లు ఉంటుందని, కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలని, ఎస్సీ, ఎస్టీలు 45 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. దీంతోపాటు క్యాట్/ఐసెట్/ఏటీఎంఏ లేదా తత్సమాన పరీక్షల్లో అర్హత సాధించి ఉండాలని పేర్కొన్నారు. ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి లేదని తెలిపారు. బీబీఏ కోర్సుకు నాలుగేళ్ల కాలవ్యవధి ఉంటుందని, 50 శాతం మార్కులతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. వయోపరిమితి 22 సంవత్సరాలకు మించరాదని, ఎస్సీ, ఎస్టీలకు మూడేళ్ల సడలింపు ఉంటుందని తెలిపారు. బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) కోర్సు మూడేళ్లు ఉంటుందని, 10 ప్లస్ 2 లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఈకోర్సులో ప్రవేశానికి జాతీయస్థాయిలో ఎన్‌సీహెచ్‌ఎంటీ – 2023 ప్రవేశపరీక్ష జేఈఈలో అర్హత సాధించి ఉండాలని తెలిపారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన..


డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

కొత్తగూడెంరూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ప్రియాంక ఆల మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 55 పోలింగ్ కేంద్రాలకు 312 మంది ఎన్నికల సిబ్బందిని కేటాయించామని తెలిపారు. పీఓలు, ఏపీఓలు 76 మంది చొప్పున, ఓపీఓలు 160 మంది ఉన్నారని వివరించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటుచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, తహసీల్దార్ పుల్లయ్య, ఎన్నికల డీటీ రంగప్రసాద్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు

ఎస్పీ రోహిత్‌రాజ్ హెచ్చరిక

కొత్తగూడెంటౌన్: నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రోహిత్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అమాయక రైతులను మోసం చేస్తూ అక్రమార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని, ఇకపై వారు పద్ధతి మార్చుకోవాలని సూచించారు. కొన్ని కంపెనీలు కాలం చెల్లిన విత్తనాలను రీసైక్లింగ్ చేసి కొత్తవని చెబుతూ రైతులకు అంటగడుతున్నారని, తద్వారా సరైన దిగుబడి రాక అన్నదాతలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. రైతులు నకిలీ విత్తనముల బారిన పడకుండా వ్యవసాయ అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశామని, జిల్లాలోని విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని ఆయా మండలాల పోలీసులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచి మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు..


కానిస్టేబుల్ కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పని చేస్తూ అనారోగ్యంతో మరణించిన వీరన్న కుటుంబానికి రూ.4 లక్షల చెక్కును ఎస్పీ రోహిత్‌రాజ్ మంగళవారం అందజేశారు. కొమరారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వీరన్న ఇటీవల మృతిచెందాడు. ఆయన కుటుంబసభ్యులు ఎస్పీని తన కార్యాలయంలో కలవగా ఈ మేరకు చెక్కు అందజేశారు. పోలీస్ శాఖలో పనిచేసే సిబ్బంది, అధికారులు నిరంతరం ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. మరణించిన పోలీసుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్‌ఐ కృష్ణారావు, జిల్లా పోలీసుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, సుధాకర్, సత్యవతి, మధు పాల్గొన్నారు.

'మొర్రేడు'కు మోక్షం

- వాగుపై అందుబాటులోకి రెండో బ్రిడ్జి
- ఎన్‌హెచ్ నిర్మాణంలో రూ.9 కోట్లతో పనులు
- ట్రయల్ రన్‌లో రాకపోకలకు అనుమతి
- త్వరలోనే అధికారికంగా ప్రారంభోత్సవం


రెండో బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు..

కొత్తగూడెంరూరల్: జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి పనుల్లో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోని మొర్రేడు వాగుపై తొమ్మిదేళ్ల క్రితం చేపట్టిన రెండవ బ్రిడ్జి ఎట్టకేలకు పూర్తయింది. సోమవారం ట్రయల్ రన్ నిర్వహించగా, మంగళవారం నుంచి వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. దీంతో వాహన చోదకులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల సాకారం అయింది. నేషనల్ హై వే రోడ్డు పనుల్లో భాగంగా రుద్రంపూర్ నుంచి భద్రచాలం వరకు 44 కిలోమీటర్ల మేర తారు రోడ్డుతోపాటు, మధ్యలో కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణానికి 2015లో రూ.240 కోట్లు మంజూరు చేశారు. ఈ రోడ్డు పనులు ఎప్పుడో పూర్తయ్యాయి. అంతేకాక జిల్లా కేంద్రంలోని గోదుమ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 5 కోట్లు కేటాయించగా ఈ ఏడాదే పనులు పూర్తి చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని మొర్రేడు వాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు చేశారు. కాగా ఈ పనులు ఆగుతూ.. సాగుతూ నత్తనడకన కొనసాగాయి. దీంతో నిర్మాణానికి తొమ్మిదేళ్లు పట్టింది. ఎట్టకేలకు పనులు పూర్తి కావడంతో ఎన్‌హెచ్ ఈఈ యుగంధర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ట్రయల్ రన్ చేపట్టగా, మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ట్రాఫిక్ జామ్‌కు చెక్..

మొర్రేడు వాగుపై ఇంతకాలం ఒకే బ్రిడ్జి ఉండడంతో దానిపై ఎప్పుడూ ట్రాఫిక్ జామ్ అవుతుండేది. ఇటు కొత్తగూడెం, అటు లక్ష్మీదేవిపల్లి వైపు వాహనాలు భారీగా నిలిచిపోయేవి. భారీ వాహనాలు బస్సులు, ట్రాలీలు, ఆటోలు, ద్విచక్రవాహన చోదకులు సైతం ఇబ్బంది పడేవారు. మొర్రేడువాగు బ్రిడ్జి అవతల వైపున విద్యా సంస్థలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం ఒకే బ్రిడ్జిపై రవాణాకు అంతరాయం కలుగుతుండేది. ఇప్పుడు రెండో వంతెన ప్రారంభం కావడంతో ఖమ్మం, కొత్తగూడెం, విజయవాడ నుంచి ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు వైపు వెళ్లే వారికి ట్రాఫిక్ ఇక్కట్లు తొలగిపోయినట్టయింది.

ట్రాఫిక్ ఇక్కట్లు ఉండవు...



మొర్రేడు వాగుపై రెండో బ్రిడ్జి ప్రారంభం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పినట్టయింది. ఎన్నో సంవత్సరాలుగా ఈ సమస్య ప్రజలను వేధించేది. ఇప్పుడు బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం ఉండదు. సమయం వృథా కాదు.

– ఆకుల శ్రీనివాస్, లక్ష్మీదేవిపల్లి

విద్యార్థులకు సులువు



మొర్రేడు వాగు బ్రిడ్జికి అటు వైపు విద్యా సంస్థలు ఎక్కువగా ఉండడంతో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య ఉండేది. వాహనాల రద్దీతో విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు ఆలస్యంగా వెళ్లేవారు. ఇప్పుడు మొర్రేడు వాగు పై రెండో బ్రిడ్జి నిర్మాణంతో ఇక ఆ సమస్యలకు చెక్ పడనుంది.

– మచ్చా వెంకటేశ్వరరావు, లక్ష్మీదేవిపల్లి

ప్రతిభకు పట్టం



పేద విద్యార్థులకు ప్రభుత్వం కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రతిభ ఉన్న విద్యార్థుల ఉన్నత చదువుకు అడ్డంకులు ఎదురుకావొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యాన 'కార్పొరేట్ విద్య' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద విద్యార్థులకు రిజర్వేషన్ల వారీగా సీట్లు కేటాయిస్తారు. ఈ పథకం కింద ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశముంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ–ఈ, బీసీ–సీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులను దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా ప్రకటించారు. – ఖమ్మం మయూరిసెంటర్

పేద విద్యార్థుల చెంతకు కార్పొరేట్ విద్య

- జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యాన పథకం
- ఎస్సెస్సీలో ప్రతిభ కనబర్చిన వారికి ఇంటర్‌లో ప్రవేశాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేట్ కళాశాలల్లో..

పదో తరగతిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులు ఇంటర్మీడియట్ కార్పొరేట్ కళాశాలల్లో చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఎంపికైన ప్రతీ విద్యార్థికి ఫీజు కింద రూ.35 వేలు, ఖర్చుల కింద ఏటా రూ.3 వేలు అందిస్తారు. అలాగే ఉచితంగా వసతి సదుపాయం కల్పిస్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు పథకం కింద ఎంపికైన రాష్ట్రంలోని ఏకార్పొరేట్ కళాశాలలో ప్రవేశానికైనా విద్యార్థులు దరఖాస్తు చేసుకునే వీలుంది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఖమ్మం జిల్లాలో 107, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 161 సీట్లు కేటాయించారు. ఖమ్మం జిల్లాలోని శ్రీ చైతన్య ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య జనరేషన్ క్యాంపస్, కృష్ణవేణి కోఆపరేటివ్ జూనియర్ కళాశాల, రెజొనెన్స్ జూనియర్ కళాశాల, సీవీ.రామన్ జూనియర్ కళాశాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కృష్ణవేణి కోఆపరేటివ్ జూనియర్ కళాశాలలు జాబితాలో ఉండగా, విద్యార్థుల ఎంపిక చేసుకున్న కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

ఆదాయ పరిమితి..

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశం పొందాలంటే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలుగా నిర్దేశించారు. బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులైతే రూ.లక్ష మించకూడదు. విద్యార్థులు దరఖాస్తుతోపాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, పదో తరగతి మార్కుల మెమో, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, దివ్యాంగులైతే ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది.

ఈ విద్యార్థులకు అవకాశం..

పదో తరగతి వార్షిక పరీక్షల్లో 7 జీపీఏ నుంచి 10 జీపీఏ వరకు సాధించిన విద్యార్థులకు ప్రవేశాలకు అవకాశముంటుంది. ప్రభుత్వ సంక్షేమ శాఖ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ప్రభుత్వ గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్, నవోదయ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ఎంపికల్లో ప్రాధాన్యత ఇస్తారు. కేటగిరీల వారీగా ఎక్కువ దరఖాస్తులు వస్తే మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 'ఈ–పాస్' వెబ్‌సైట్‌లో 'కార్పొరేట్' ఆప్షన్‌ను ఎంపిక చేసుకుని దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం కార్పొరేట్ విద్యా పథకాన్ని అమలు చేస్తోంది. పదో తరగతిలో 7 జీపీఏ, ఆపై మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యాబోధనతో పాటు ఉచిత వసతికి అవకాశముంది. పథకం కింద ప్రకటించిన కళాశాలల్లో ఎక్కడైనా చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

–కస్తాల సత్యనారాయణ, ఎస్సీ డీడీ, ఖమ్మం

కులాల వారీగా విద్యార్థులకు కేటాయించిన సీట్లు

జిల్లా	ఖమ్మం		భద్రాద్రి కొత్తగూడెం	
	బాలికలు	బాలురు	బాలికలు	బాలురు
ఎస్సీ	28	18	14	09
మైనార్టీ	03	02	03	02
ఎస్టీ	10	16	45	69
బీసీ	10	07	06	04
బీసీ–బీ	05	03	02	02
ఈబీసీ	03	02	03	02
మొత్తం	59	48	73	88



పత్తి సాగుకు పదునే అదును

- 60 మి.మీల వర్షపాతం ఉంటేనే నాటడం మేలు
- నేలలకు అనువైన విత్తన రకాల ఎంపిక కీలకం
- పత్తి సాగుపై అధికారుల సూచనలు



చింతకాని మండలం లచ్చుగూడెంలో పత్తి సాగుకు దుక్కి చేస్తున్న రైతు



పత్తి విత్తనాలను నాటుతున్న కూలీలు (ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల్లో పత్తి ఒకటి. గత ఏడాది జిల్లాలో సుమారు లక్ష ఎకరాలకు పైగా రైతులు పత్తిని సాగు చేశారు. ఈ ఏడాది ఈ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉపరితల ఆవర్తనం, ద్రోణి కారణంగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వేసవి దుక్కులు చేస్తున్న రైతులు పత్తి విత్తడానికి సన్నద్ధమవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నల్ల నేలల్లో, ఇతర రకాల నేలల్లో రైతులు పొడి దుక్కుల్లో ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా పత్తి విత్తేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అయితే, పత్తికి అనువైన మోతాదులో వర్షపాతం ఉండాలి. అప్పుడే మొలకశాతం, పైరు ఏపుగా పెరుగుతుంది. తగిన వర్షపాతం లేకుండా పత్తి విత్తనాలు వేస్తే సరైన మొలక శాతం రాదు. తగిన వర్షపాతం లేకుండా పత్తిని విత్తితే సరైన మొలక శాతం రాదు. తగిన మోతాదులో వర్షపాతం ఉన్నప్పుడు పత్తిని విత్తుకుంటే మొలకశాతం బాగుంటుందని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, ఉద్యాన శాస్త్రవేత్త శివ వెల్లడించారు. ఈ సందర్భంగా పత్తి సాగు చేసే రైతులకు వారు ఇచ్చిన సూచనలు ఇలా ఉన్నాయి.

- పత్తిని జూన్, జూలై నెలల్లో విత్తుకోవచ్చు. వర్షపాతం ఆధారంగా జూలై 20వ తేదీ వరకు విత్తుకోవచ్చు. జూలై 20 తరువాత విత్తితే దిగుబడి తగ్గే అవకాశముంది.
- ఒకటి, రెండు తేలికపాటి వర్షాలు పడగానే తొందరపడొద్దు.
- కనీసం 60మి.మీల వర్షపాతం నమోదయ్యాకే పత్తి గింజలను నాటితే వంద శాతం మొలక వస్తుంది.
- రైతులు తమ ప్రాంతానికి అనువైన బీటీ విత్తనాలను అనుభవంపై ఎంచుకోవాలి. అవి కూడా ఒకటే రకం కాక రెండు నుంచి మూడు రకాల విత్తనాలను ఎంచుకుంటే మంచిది.
- వర్షాధారంగా సాగు చేస్తే త్వరగా పూతకొచ్చే రకాలు, నీటి వసతి ఆధారంగా సాగుకు మధ్యస్తంగా, ఆలస్యంగా పూతకు కాతకు వచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి.
- బీటీ విత్తనాలు ఎంపిక చేసుకునే రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలి. నేల స్వభావాన్ని దృష్టిలో పెట్టుకొని 40 లేదా 42 అంగుళాల అచ్చు వేసుకొని విత్తితే మంచి దిగుబడి సాధించవచ్చు.
- తేలిక నేలల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని 36x6 అంగుళాల దూరంలో లేదా దగ్గరగా సాగు చేసే పద్ధతిలో 36x12 అంగుళాల దూరంలో విత్తుకోవాలి. అధిక సాంద్రత లేదా దగ్గరగా సాగు చేసే పద్ధతికి అనువైన వంగడాలను ఎంచుకుంటే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అంతేగాక రెండో పంట కూడా సకాలంలో విత్తుకోవచ్చు.
- పత్తి గింజలు విత్తిన 48 గంటల్లో తేమ ఉన్నప్పుడు పిండిమిథాలిన్ 1.2 మి.లీ లీటర్లు ఎకరాకు పిచికారీ చేసుకుంటే కలుపు ఉధృతి తగ్గుతుంది.
- వాతావరణ శాఖ జారీ చేసే ముందస్తు వాతావరణ సూచనలను తెలుసుకొని పత్తి విత్తనాలను విత్తుకుంటే మంచి మొలకశాతం, ఉత్తమ దిగుబడులు ఉంటాయి.

గాలివాన బీభత్సం

- విరిగిన విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



కరకగూడెం: గాలివానకు ధ్వంసమైన రేకుల ఇల్లు



కరకగూడెం: చిరుమళ్లలో రోడ్డుపై పడిన చెట్టు



పాల్వంచరూరల్: నేలకూలిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

కరకగూడెం: మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. చిరుమళ్ల గ్రామంలో గాలి విధ్వంసం సృష్టించింది. గ్రామంలోని చింత చెట్టు విరిగి అక్కడున్న విద్యుత్ తీగలపై పడటంతో అదే వరుసలో ఉన్న సుమారు ఏడు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఈ క్రమంలో ఓ ఇంటి ఆవరణలో విద్యుత్ స్తంభం పడింది. కానీ, ఎవ్వరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. గ్రామంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న కరకగూడెం విద్యుత్ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. సుమారు రూ.లక్ష వరకు విద్యుత్ శాఖకు ఆస్తి నష్టం జరిగినట్లు ఏఈ నరేందర్‌రెడ్డి తెలిపారు. అలాగే పోలకమ్మతోగు గ్రామంలో గాలివానకు ఏడూళ్ల రాంబాబుకు చెందిన రేకుల ఇళ్లు ధ్వంసమైంది.

పాల్వంచ మండలంలో..

పాల్వంచరూరల్: మండలంలో మంగళవారం సాయంత్రం వీచిన గాలి దుమారం విధ్వంసం సృష్టించింది. జగన్నాథపురం, తోగ్గూడెం గ్రామాల ప్రధాన రహదారి పక్కన చెట్లు కూలిపడ్డాయి. రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పంచాయతీ సిబ్బంది రహదారిపై కూలిన చెట్లను తొలిగించినట్లు గ్రామ కార్యదర్శి రవి తెలిపారు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఇద్దరి పరిస్థితి విషమం




కుంజా నాగేంద్రబాబు, సోయం నాగేంద్రబాబు (ఫైల్)



క్షతగాత్రులను అంబులెన్స్ ఎక్కిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట: మండలంలోని పార్కలగండి, పట్వారిగూడెం గ్రామాల్లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పూసుకుంట జీపీ కటుకూరు గ్రామానికి చెందిన పర్సిక రమేశ్ (30), పూనెం చరణ్ (16) మంగళవారం ద్విచక్రవాహనంపై దమ్మపేటకు బయలుదేరారు. పార్కలగండి గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా పాల్వంచ వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. రమేశ్ కాలు విరిగిపోగా.. చరణ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. రమేశ్‌ను 108 ద్వారా దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి సత్యావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు. కాగా, గండుగులపల్లి గ్రామానికి చెందిన సోయం నాగేంద్రబాబు (19), గోరం సాగర్(19), గొర్రెగుట్ట గ్రామానికి చెందిన కుంజా నాగేంద్రబాబు(19) ఒకే బైక్‌పై పట్వారిగూడెం మీదుగా దమ్మపేటకు వెళ్తుండగా పాల్వంచ వైపు అతివేగంతో వెళ్తున్న లారీ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. యువకులు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అంబులెన్స్‌తో పాటుగా ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కుంజా నాగేంద్రబాబు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మిగిలిన ఇద్దరినీ ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో సోయం నాగేంద్రబాబు మృతి చెందాడు. గోరం సాగర్ ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుంజా నాగేంద్రబాబు తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాల్వంచ: అనారోగ్య సమస్యల కారణంగా మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గట్టాయిగూడెంనకు చెందిన మాలోతు శ్రీను (38) ఈ నెల 16వ తేదీన అర్ధరాత్రి పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తగూడెం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి సక్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది మంది బైండోవర్

దుమ్ముగూడెం: మండలంలోని సుజ్ఞానపురం గ్రామానికి చెందిన ఎనిమిది మందిని ఎక్సైజ్ శాఖ అధికారులు రెవెన్యూ అధికారుల ఎదుట మంగళవారం బైండోవర్ చేశారు. గ్రామానికి చెందిన కొందరు గతంలో నాటుసారా విక్రయిస్తూ పట్టుబడి కేసులపాలయ్యారు. తిరిగి నాటుసారా విక్రయిస్తుండగా గుర్తించి వారిని బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ సీతారామరాజు, సిబ్బంది అలీ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గోదావరిలో ఎలాంటి అనుమతులు లేకుండా పూడికతీత పనులు చేపట్టిన ఎస్‌ఎల్‌ఎస్ ప్రాజెక్టుకు చెందిన ఆరు వాహనాలను రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. ఎస్‌ఎల్‌ఎస్ ప్రాజెక్టుకు చెందిన సిబ్బంది గోదావరిలో పేరుకుపోయిన మట్టి, ఇసుకను అనుమతులు లేకుండా తీస్తుండటంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

బైక్‌ల చోరీ నిందితులు అరెస్ట్



నిందితులు, బైక్‌లతో పోలీసులు

దుమ్ముగూడెం: ద్విచక్ర వాహనాలను అపహరించి, విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గణేశ్ తెలిపారు. మంగళవారం మండలంలోని నర్సాపురం గ్రామంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీ చేశారు. వారు వినియోగించిన ద్విచక్ర వాహనాలు చోరీ చేసినవిగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, భద్రాచలం, ఆంధ్ర ప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడి సుమారు ఏడు వాహనాలను అపహరించినట్లు అంగీకరించారు. చోరీ చేసిన బైక్‌లను మండలంలోని సుజ్ఞానపురం గ్రామానికి చెందిన సోమ్లాకు మూడు బైక్‌లు విక్రయించగా, భద్రాచలానికి చెందిన మల్లా రవీందర్, దూళ్ల శ్రీనివాస్, బూర్గంపాడు మండలానికి చెందిన బూరం అనిల్‌కుమార్ నుంచి నాలుగు బైకులు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. రాత్రిపూట భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ, దుమ్ముగూడెం, ఎటపాక మండలాల్లో తిరుగుతూ ఆరు బయట పార్కింగ్ చేసిన మోటార్ సైకిళ్ల చోరీ చేసి, తక్కువ ధరకు అమ్ముతూ వచ్చిన సొమ్ముతో జల్సా చేస్తున్నారని ఎస్‌ఐ వివరించారు.

11 నెలల బాలుడి అదృశ్యం..

- కిడ్నాప్ చేసినట్లు అనుమానాలు
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు



సాయి దేవాన్ష్

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణంలో 11 నెలల బాలుడి అదృశ్యం కలకలం రేపింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ జయమ్మ కాలనీకి చెందిన వాణరాసి జంపన్న – దుర్గ దంపతులు వారం క్రితం వచ్చి సత్తుపల్లి పట్టణ శివారు గుడిపాడులో గుడారాలు వేసుకొని నివాసముంటున్నారు. ఇంటింటికీ తిరిగి గ్యాస్ స్టౌలు, మిక్సీలు బాగు చేసే వీరు, తమ కుమారుడు సాయిదేవాన్ష్‌తో కలిసి సోమవారం రాత్రి నిద్రించారు. అయితే, అర్ధరాత్రి 12.30 గంటల సమయాన చూసేసరికి బాలుడు లేకపోవడంతో జంపన్న దంపతులు ఎక్కడ వెతికినా ఆచూకీ కానరాలేదు. కాగా మూడు, నాలుగు రోజుల నుంచి గుడారాల సమీపాన రాత్రి వేళ ఒక కారులో కొందరు వచ్చివెళ్తుండగా, వారే బాలుడిని కిడ్నాప్ చేశారని సందేహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యాన సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ ఆధ్వర్యాన సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. అంతేకాక బాలుడి ఆచూకీ కనుగొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, బాలుడు సాయి దేవాన్ష్ కానరాకుండా పోవడంతో ఆయన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

క్లుప్తంగా

అవే ఎదురుచూపులు..

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా వైద్యశాలలో పలువురికి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించగా నిధులు గత ప్రభుత్వం కానీ కొత్త ప్రభుత్వం కానీ విడుదల చేయలేదు. దీంతో ఏడాదిన్నరగా ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ అంశంపై 'సాక్షి'లో 'నిధులు నిల్'శీర్షికన ఆదివారం కథనం ప్రచురితం కాగా, ఇల్లెందు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్ ఉన్నతాధికారులకు మంగళవారం వివరణ పంపించారు. ప్రతీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా అందించే సేవలకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే, అభివృద్ధి, పరికరాల కొనుగోలుకు వెచ్చిస్తారు. ఇలా ఏడాదిన్నరగా ఇల్లెందు ఆస్పత్రికి సుమారు రూ.70 లక్షల వరకు నిధులు విడుదల కావాల్సి ఉన్నా రాకపోగా.. జిల్లాలోని ఇల్లెందు, పాల్వంచ, బూర్గంపాడు, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సూపరింటెండెంట్ హర్షవర్ధన్ తెలిపారు.

జైలు నుంచి విడుదలైన ఎన్డీ నేత అశోక్



విడుదలైన అశోక్‌తో ఎన్డీ నాయకులు

ఇల్లెందు: న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ అలియాస్ కుర్సం వజ్జయ్య మంగళవారం ఖమ్మం జైలు నుంచి విడుదలయ్యారు. సీపీఐ (ఎంఎల్) పేరుతో అనేక వర్గాలు ఉండగా.. రాష్ట్ర కార్యదర్శి స్థాయి వరకు ఎదిగిన ఎన్డీ చంద్రన్న వర్గం నేత అశోక్‌ను కొన్నాళ్ల కిందట పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన అరెస్టు తర్వాత పార్టీ సంక్షోభంలో కూరుకుపోగా, చంద్రన్నతో ఏపీలో తలెత్తిన విబేధాలు, గుంటూరు జిల్లాలో నాయకుడు బ్రహ్మయ్య హత్యతో ఆ వర్గం చీలిపోయింది. దీంతో సాదినేని వెంకటేశ్వరరావును రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అయితే అశోక్ విడుదలైన నేపథ్యాన చంద్రన్న, వెంకటేశ్వరరావు వర్గాల్లో ఎవరి వెంట పయనిస్తాడో తేలాల్సి ఉంది. కాగా, అశోక్ జైలు నుంచి విడుదలైన సందర్భంగా రెండు వర్గాల నాయకులు ఆయనను కలిశారు.

కోక్యాతండా వాసికి ఈసెట్‌లో మూడో ర్యాంక్



సాత్విక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

టేకులపల్లి: మండలంలోని తడికలపూడి పంచాయతీ కోక్యాతండాకు చెందిన తేజావత్ లక్ష్మణ్ – కవిత దంపతుల కుమారుడు సాత్విక్ ఈసెట్ జనరల్ విభాగంలో రాష్ట్రస్థాయి మూడో ర్యాంక్ సాధించాడు. మంగళవారం విద్యార్థిని ఉపాధ్యాయ సంఘాల నాయకుడు జి.మోతీలాల్, ఎం.బాలు, ఎ.రమేశ్, బి.మోహన్, ఎన్.రాంచందర్, ఎల్.గణేశ్ సన్మానించారు.

ఎస్టీ నుంచి లంబాడీల తొలగింపునకు ఉద్యమం



మాట్లాడుతున్న మైపతి అరుణ్‌కుమార్

ఇల్లెందురూరల్: ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించే వరకు ఉద్యమిద్దామని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇల్లెందు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన ఆదివాసీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో లంబాడీల కారణంగా ఆదివాసీ జాతి అన్యాయానికి గురవుతోందని, ఈ కారణంగానే వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు ఉద్యమం ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో అన్ని అవకాశాలను లంబాడీలు పొందుతూ ఆదివాసీలకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు మోకాళ్ల సతీశ్, పాదెం భరత్, వాసం రమేశ్, మోకాళ్ల శ్రీకాంత్, చీమల అభిలాష్, కల్తీ మురళి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకొని వ్యక్తి బలవన్మరణం

మోతె: భార్యాభర్తల మధ్య గొడవలతో మనస్తాపానికి గురైన వ్యక్తి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలం ఉర్లుగొండలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా తిర్మలాయపాలెం మండలం పైనంపల్లికి చెందిన దంపతులైన కంచెం కొమరయ్య(38), రమ నడుమ గొడవలు జరుగుతున్నాయి. దీంతో రమ వారం క్రితం తన ముగ్గురు ఆడపిల్లలను తీసుకొని తల్లిగారింటికి వెళ్లిపోయింది. ఈమేరకు మనస్తాపానికి గురైన కొమరయ్య సోమవారం అర్ధరాత్రి మోతె మండలం ఉర్లుగొండ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు పట్టుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.